క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు


పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

శివ్వంపేట(నర్సాపూర్): వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని సికింద్లాపూర్ గ్రామంలోని పలు కాలనీల్లో నీటి పైపులైన్‌లు దెబ్బతినడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గురువారం ఎంపీడీఓ వాటిని పరిశీలించి మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించారు. గ్రామ కార్యదర్శులు నిత్యం గ్రామాల్లో అందుబాటులో ఉంటూ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


ప్రీతమ్‌ను సన్మానిస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

రామాయంపేట(మెదక్): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన నగరిగారి ప్రీతమ్‌ను గురువారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ ప్రతినిధులు సన్మానించారు. సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాంకుమార్, తదితరులు గాంధీభవన్‌లో ప్రీతమ్‌ను కలిశారు. జిల్లా కార్యదర్శి రామచంద్రం, రామాయంపేట, చిన్నశంకరంపేట మండలాల సంఘం అధ్యక్షుడు గావు భాస్కర్, మదూరి మల్లేశ్, ఇతర నాయకులు సాయిలు, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ఎస్సీసెల్ మెదక్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్ హైదరాబాద్‌లో ప్రీతమ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి రామచందర్, మల్లేశం, సంగాయిపల్లి మాజీ ఉపసర్పంచ్ సాయిలు, భాస్కర్, బైరం రామ్ కుమార్, అనుదీప్ ఉన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ వ్యవసాయశాఖ మంత్రికి వినతి పత్రం ఇచ్చినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వారం నుంచి కురుస్తున్న అకాల వర్షాల వల్ల పలు పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు. ఎకరానికి రూ.15 వేల పరిహారం చెల్లించాలని కోరినట్లు ఆయన తెలిపారు. అధికారులు స్పందించి పొలాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు


కండువాలు కప్పి పార్టీలో చేర్చుకుంటున్న కాంగ్రెస్ నేతలు

నర్సాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పలువురు నేతలు ఆకర్షితులవుతున్నారని డీసీసీ తాత్కాలిక అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన రాజు, వీరేందర్, విష్ణు తదితరులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రిజ్వాన్, సుహాసినీరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇబ్రహీంబాద్‌కు చెందిన కొండల్‌రెడ్డికి ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.2.10లక్షల ఎల్‌ఓసీని అందజేశారు.

శివ్వంపేటలో కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): ఎన్నికల బందోబస్తులో భాగంగా కేంద్ర బలగాలు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కవాతు చేపట్టాయి. ఈ సందర్భంగా గురువారం తూప్రాన్ సీఐ కృష్ణ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని చెప్పారు. రౌడీషీటర్లను ముందస్తుగా బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రెండేళ్లకే నిర్మాణాలు శిథిలం

నిర్లక్ష్యం నీడలో 2 రైల్వేస్టేషన్లు

- నిఘా లోపంతో చోరీలు
- నిమిషంపాటే నిలుపుదల
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రయాణికులు

జిల్లా పరిధిలోని రెండు రైల్వేస్టేషన్ల నిర్మాణాలు శిథిలమవుతున్నాయి. అందుకు కారణం నిర్మాణపనుల్లో నాణ్యత లేకపోవడమే. దానికితోడు నిఘా నిర్వహించడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విలువైన సామగ్రి దొంగల పాలవుతోంది. పర్యవేక్షణ లేకపోవడం వల్ల దీనావస్థలో ఉన్నాయి.


లక్ష్మాపూర్ స్టేషన్‌వద్ద తారురోడ్డు దుస్థితి

రామాయంపేట (మెదక్): జిల్లా కేంద్రమైన మెదక్, అక్కన్నపేట గ్రామాల మధ్య రూ.210 కోట్లతో రైల్వేలైన్ నిర్మించారు. మెదక్ మండలంలోని షమ్నాపూర్, రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌వద్ద ఈ స్టేషన్లు నిర్మించారు. వాటిని 2022 సెప్టెంబరులో ప్రారంభించారు. జిల్లా కేంద్రంపై దృష్టి సారించిన ఆ శాఖ ఉన్నతాధికారులు మెదక్ స్టేషన్‌లో మాత్రమే టికెట్ బుకింగ్ కేంద్రంతోపాటు ఇతర సదుపాయాలు కల్పించారు. షమ్నాపూర్, లక్ష్మాపూర్‌వద్ద స్టేషన్లు నిర్మించినా అధికారులు మాత్రం వాటిని పట్టించుకున్న పాపాన పోలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

విలువైన సామగ్రి చోరీ

ఈ రెండు స్టేషన్లు గ్రామాలకు దూరంగా ఉండడం, సరిగా నిఘా ఏర్పాటు చేయకపోడంతో వాటికి సంబంధించిన సామగ్రి దొంగలపాలవుతోంది. షమ్నాపూర్ స్టేషన్ గది తాళాలు పగులగొట్టిన దుండగులు లోపల బిగించిన ఫ్యాన్లను అపహరించుకుపోయారు. రెండు స్టేషన్లలో మరుగుదొడ్లను సైతం ధ్వంసం చేశారు. లోపల బిగించిన నల్లాలు, ఇతర సామగ్రిని కూడా ఎత్తుకెళ్లారు. తలుపులు ధ్వంసం చేసి విద్యుత్ స్విచ్ బోర్డులను పగులగొట్టి వైర్లను అపహరించారు. ప్రస్తుతం రెండు స్టేషన్లలోను కేవలం టేబుళ్లు మాత్రమే మిగిలాయి.

పనుల్లో నాణ్యతాలోపం..

నాసిరకం పనులతో రెండు స్టేషన్లలో ప్లాట్‌ఫాంలు, తారురోడ్లు రెండేళ్లకే దెబ్బతిన్నాయి. షమ్నాపూర్ స్టేషన్‌కు వెళ్లే తారురోడ్డు పాక్షికంగా దెబ్బతింది. గత ఏడాది దారి మధ్యలో బ్రిడ్జి కొట్టుకుపోగా, మళ్లీ నామమాత్రంగా దానిని నిర్మించారు. లక్ష్మాపూర్ స్టేషన్‌కు వెళ్లేదారిలో తారురోడ్డు మధ్యలో బ్రిడ్జివద్ద పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. షమ్నాపూర్ స్టేషన్ ప్లాట్‌ఫాంపై స్ట్రీట్‌లైట్లకు సంబంధించిన విద్యుత్ స్తంభం నాసిరకం నిర్మాణం వల్ల నేలకూలింది. మెదక్– అక్కన్నపేట స్టేషన్ల మధ్య నడిచే రైళ్లు నిమిషంపాటు మాత్రమే ఆపుతున్నారు. ఇకనైనా ఆశాఖ అధికారులు చర్యలు తీసుకొని స్టేషన్లలో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడంతోపాటు నాసిరకం పనులపై దృష్టి సారించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.


షమ్నాపూర్ స్టేషన్‌లో నేలకొరిగిన స్తంభం

తాగునీటి సమస్య రావొద్దు

ఎంపీడీఓ సీతారావమ్మ


మాట్లాడుతున్న ఎంపీడీఓ సీతారావమ్మ

రేగోడ్(మెదక్): ఎక్కడ.. ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ సీతారావమ్మ ప్రత్యేక అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎండలు పెరుగుతున్న తరుణంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేశ్ మాట్లాడుతూ సింగూర్‌లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, తాగునీటి ఇబ్బందులు రావని తెలిపారు. గొర్రెల పంపిణీ పథకం ద్వారా గొర్రెలు ఇంకా ఇవ్వలేదని, తమ డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలని కొత్వాన్‌పల్లి ఎంపీటీసీ నాగిరెడ్డి కోరారు. వేసవిలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ శ్వేత కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినీల, ఎంపీటీసీలు నర్సింహులు, సంగీత, ఏఓ జావీద్, ఆర్‌ఐ పెరోజ్, ఏపీఓ జగన్, ఎంఐఎస్ శ్వేత, ట్రాన్స్‌కో ఏఈ యాసిన్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

చిలప్‌చెడ్(నర్సాపూర్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ వినోదరెడ్డి, ఎంపీడీఓ ఆనంద్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభవుతుందన్నారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న క్రాంతికిరణ్, అనిల్

అల్లాదుర్గం(మెదక్): పట్టణంలోని పురాతన వేంకటేశ్వర దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం ఆలయం వద్ద శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలలో అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పరీక్ష కేంద్రం వద్ద ఫోన్లు చోరీ

మెదక్ మున్సిపాలిటీ: పట్ట పగలు దొంగలు తమ చేతివాటం చూపించిన ఘటన గురువారం మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మెదక్ వైపీఆర్ బీఈడీ కళాశాలకు చెందిన విద్యార్థులు మెదక్ పట్టణంలోని వెస్లీ కాలేజీలో పరీక్షలు రాస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు వారి సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు బైక్‌లు, స్కూటీల్లో భద్ర పరుచుకుంటున్నారు. వాహనాలను కళాశాల ఎదుట పార్కు చేసి పరీక్ష రాయడానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు మూడు స్కూటీల డిక్కీలను ఓపెన్ చేసి 4 మొబైల్ ఫోన్లు, రూ.4 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ దిలీప్ కుమార్ నిందితులను త్వరలో పట్టుకొని ఫోన్లు ఇప్పిస్తానని హామీనిచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి


ఎస్‌ఐలతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50వేలకు మించి నగదు తరలించేవారు సంబంధిత పత్రాలు వెంట తీసుకెళ్లాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయాలలో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఎస్‌ఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ షేక్ మహబూబ్ ఉన్నారు.

వైభవంగా విఠలేశ్వరాలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలోని రుక్మిణీపాండురంగస్వామి ఆలయ 20వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు హరిరంజన్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, శంకర్, నాగరాజు, నర్సింహులు, మాజీ ఎంపీటీసీ సిద్దిరాములుగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలు


నియామక పత్రం అందజేస్తున్న నవీన్

చేగుంట(తూప్రాన్): మంలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏర్పాటు చేస్తున్నట్లు మండలశాఖ అధ్యక్షుడు నవీన్ తెలిపారు. గురువారం బీకొండాపూర్‌లో నూతన గ్రామ కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడుగా బ్యాగరి రమేశ్, ఉపాధ్యక్షుడుగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చంద్రం, యువజన అధ్యక్షుడిగా మహిపాల్, సోషల్‌మీడియా నర్సింహులు, మహిళా అధ్యక్షులుగా ఉమాదేవి, కిసాన్ సెల్ అధ్యక్షుడుగా దయాకర్, బూత్‌లెవల్ కార్యకర్తగా స్వామిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రామస్వామి, నాయకులు అంజిరెడ్డితో పాటు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే ఓటింగ్

తహసీల్దార్ గియాసున్నీసా


మాట్లాడుతున్న తహసీల్దార్ గియాసున్నీసా

చేగుంట(తూప్రాన్): వృద్ధులు దివ్యాంగుల ఓటర్ల వివరాలను సేకరించాలని తహసీల్దార్ గియాసున్నీసాబేగం ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులైన ఓటర్లను గుర్తించి 12–డీ ఫారాలను పూర్తిచేసి ఇవ్వాలని, వారికి ఇంటివద్దనే పోస్టల్ బ్యాలెట్ నిర్వహించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నర్సింగ్‌యాదవ్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం


భిక్షపతి (ఫైల్)

చేగుంట(తూప్రాన్): మండలంలోని పోతాన్‌పల్లి గ్రామంలో వ్యక్తి అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వృద్ధుడైన బక్క భిక్షపతి 17వ తేదీ మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాడు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. అతడి కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


మనోహరాబాద్(తూప్రాన్): పోషకాహారాన్ని అందిస్తున్న సీడీపీఓ హేమభార్గవి

పోషకాహారంతోనే ఆరోగ్యం పదిలం

సీడీపీఓ హేమభార్గవి

మనోహరాబాద్(తూప్రాన్): పోషకాహారంతోనే మహిళల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, సమతుల ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యాన్ని సంరక్షించుకోగలమని నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి పిలుపునిచ్చారు. గురువారం మనోహరాబాద్ మండలం జీడిపల్లి అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ అభియాన్ పక్వాడా వారోత్సవాలలో భాగంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తప్పకుండా పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే ఆహారాన్ని ప్రతి ఒక్కరు తప్పకుండా స్వీకరించాలన్నారు. అనంతరం పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నక్కుబాయి, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, కారోబార్ హబీబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ హేమభార్గవి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 7వ అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పలు పోషకాలతో తయారుచేసిన వంటకాలను వడ్డించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఇందిర, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


చందంపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న శివకుమారి

గర్భిణులకు అత్యవసరం

చిన్నశంకరంపేట(మెదక్): గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి కోరారు. గురువారం మండలంలోని చందంపేట గ్రామంలో నిర్వహించిన పోషక వారోత్సవాల్లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, పాలు తప్పకుండా తీసుకోవాలన్నారు. సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, జ్యోతి, భవాని పాల్గొన్నారు.

జాయింట్ అకౌంట్‌లోకి అభివృద్ధి నిధులు

నోడల్ అధికారి జ్యోతి


రికార్డులు పరిశీలిస్తున్న జ్యోతి

కౌడిపల్లి(నర్సాపూర్): అమ్మ ఆదర్శ పాఠశాల(ఏఏపీ)కమిటీకి ఎన్నికైన అధ్యక్షురాలు, కన్వీనర్‌తో జాయింట్ బ్యాంక్ అకౌంట్ తీయాలని జిల్లా నోడల్ అధికారి జ్యోతి తెలిపారు. గురువారం ఎంఆర్‌సీ కార్యాలయంలో సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లతో సమీక్ష నిర్వహించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి నిధులు జాయింట్ అకౌంట్‌లో ప్రభుత్వం జమచేస్తుందన్నారు. మౌలిక వసతులు, విద్యార్థుల వివరాలు, ఆధార్‌కార్డు నంబర్ తదితర పూర్తి వివరాలు నమోదు చేయాలని చెప్పారు.

గుంతలు.. పొంచి ఉన్న ప్రమాదాలు


ధర్మాసాగర్ గేట్ సమీపంలో గుంత

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు పక్కన తీసి వదిలేసిన గుంతల వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని ధర్మాసాగర్‌గేట్ నుంచి పాంపల్లి, బూరుగడ్డ, కంచన్‌పల్లి వరకు బీటీరోడ్డు వెంబడి పక్కగా ఓ ప్రైవేట్ మొబైల్ ఇంటర్‌నెట్ కోసం కేబుల్ వేసేందుకుగాను పలుచోట్ల గుంతలు తవ్వి పూడ్చకుండా వదిలేశారు. ప్రమాదాన్ని సూచించే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. రోజుల తరబడి ఇలాగే ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతల్లో పడి ప్రమాదాల బారిపన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు


మాట్లాడుతున్న రఘునందన్‌రావు

వెల్దుర్తి(తూప్రాన్): కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్య చీకటి ఒప్పందాలు జరుగుతున్నాయని, త్వరలో మాజీమంత్రి హరీశ్‌రావు మినహా ఉమ్మడి మెదక్ జిల్లాలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. గురువారం మాసాయిపేటలోని మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పూర్తిచేయడం కేవలం బీజేపీ వల్లే సాధ్యమవుతుందన్నారు. దేశంలో 400పై చిలుకు ఎంపీస్థానాలను గెలుచుకొని బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తెలంగాణలోని 17 స్థానాలకుగాను 15 స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, స్వామి, మురళీయాదవ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు బోనం అందరికీ భాగ్యం

టేక్మాల్(మెదక్): మండల కేంద్రమైన టేక్మాల్‌లోని గంగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం బోనాలను శివసత్తుల వేషధారణలు, నృత్యాలతో ఉత్సాహంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.


బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు